సాక్షి
నిర్మల్
బుధవారం, 16, ఆగస్టు, 2023



లంబాడా నృత్య ప్రదర్శనలో సోఫీ నగర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు



జెండా వందనం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తదితరులు

అభివృద్ధి దీప్తి..

- మహనీయుల త్యాగాల ఫలితం • మనం అనుభవిస్తున్న స్వేచ్ఛజీవితం
- ప్రగతి పథంలో పయనిస్తున్నాం • జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం
- జెండావిష్కరణ చేసిన మంత్రి అల్లోల • అట్టహాసంగా పంద్రాగస్టు వేడుక



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి ఐకేరెడ్డి



వేడుకల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన

నిర్మల్: స్వాతంత్య్ర సముపార్జనకు ఎందరో మహనీయులు పోరాటాలు చేశారని, వారి త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్య్రాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. స్వాతంత్య్ర స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి వెలుగులను చూస్తోందన్నారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తదితరులతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ప్రత్యేకవాహనంలో కలెక్టర్, ఎస్పీలతో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి కర్ణకుమార్, డీఎఫ్‌వో సునీల్ హీరేమత్ తదితరులతో కలిసి వేదికపై హాజరయ్యారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఉద్దేశించి మంత్రి తన సందేశాన్ని వినిపించారు.

వ్యవసాయం: జిల్లాలో 1,94,580 మంది రైతులకు రూ.232.85కోట్ల రైతుబంధు పెట్టుబడి సాయమందుతోందన్నారు. రైతుబీమా ద్వారా ఇప్పటివరకు 2,965 మంది రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నామినీ ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో జరిగిన పంటనష్టానికి సంబంధించి రూ.42 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.

నీటిపారుదల: కాళేశ్వరం 27, 28 ప్యాకేజీల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. భారీవర్షాలకు దెబ్బతిన్న చెరువులు, ప్రాజెక్టులు, కెనాల్స్ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.

గ్రామీణాభివృద్ధి: వాననీటిని ఇంకుడు గుంతలకు చేర్చి భూగర్భ జలాలు పెంచేందుకు రికార్డుస్థాయిలో ఒకేరోజు 5,940 సోక్‌పిట్‌లను నిర్మించామని తెలిపారు. జిల్లాలో 1.74 లక్షల జాబ్‌కార్డులు జారీ చేశామన్నారు. రాష్ట్రంలోనే తొలిసారి కళలను కాపాడే దిశగా, నిర్మల్ కొయ్యబొమ్మల కోసం ప్రత్యేకంగా తొమ్మిది ఎకరాల్లో పొనికి వనం పెంచుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్: జిల్లాకు కొత్తగా నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జులైలో వర్షాలకు దెబ్బతిన్న 1,665 స్తంభాలు, 285ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయించామని చెప్పారు.

పౌరసరఫరాలు: జిల్లాలో 2022–23 యాసంగిలో 36,222 మంది రైతుల నుంచి 1,64,867 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఇందుకు రైతులకు రూ.339.58 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు.

అటవీ: జాతీయ రహదారుల పక్కన 29కి.మీ.లలో 1.70 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. దిమ్మదుర్తి పరిధిలో దుర్గం చెరువు వద్ద ఎకోటూరిజం ప్రాజెక్టు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు.

వైద్యారోగ్యం: పెంబి పీహెచ్‌సీకి రూ.1.56 కోట్లతో నూతన భవనం మంజూరు చేశామన్నారు. కొత్తగా 37 పీహెచ్‌సీ భవనాలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.

పంచాయతీరాజ్: భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న 91.14 కి.మీ. రోడ్ల కోసం టెండర్ ప్రక్రియ పూర్తయిందని, ఈజీఎస్ కింద 130 జీపీ భవనాలు రూ.26 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్నామని వివరించారు.

మున్సిపల్: మిషన్ భగీరథ ద్వారా రూ.39.39 కోట్లతో నిర్మల్ ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు.

సంక్షేమం: దళితబంధు ద్వారా 261 కుటుంబాలను ఎంపికచేసి, రూ.25.84 కోట్లను వారి ఖాతాల్లో వేశామని, 631 కుటుంబాలకు సాగుభూమి, 913 మందికి ఆర్థిక సహాయ పథకం కింద రూ.7.30 కోట్లు అందించామని వివరించారు. బీసీ బంధు ద్వారా జిల్లాలో వెయ్యిమందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేశామని తెలిపారు. మైనార్టీల్లో 232 మందికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. డబుల్‌బెడ్రూం పథకంలో భాగంగా జిల్లాలో మొత్తం 1,755 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించినట్లు తెలిపారు. గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులకు రూ.3 లక్షలు ఇస్తామన్నారు.

రహదారులు: జిల్లాలో రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. అర్లి వంతెన నిర్మాణం కోసం రూ.46 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సిద్దాపూర్‌వాగుపై హైలెవల్ వంతెనకు రూ.7.40 కోట్లు, పాక్‌పట్ల–మాదాపూర్–గాంధీనగర్ రెండు వరుసల రహదారికి రూ.14 కోట్లు మంజూరయ్యాయని వివరించారు.

మత్స్య సంపద: 2023–24 సంవత్సరానికి 641 చెరువులు, కుంటలలో 440 లక్షల చేపపిల్లలను విడుదల చేస్తామని తెలిపారు. నిర్మల్, భైంసా, సారంగపూర్‌లో రూ.72.50 లక్షలతో చేపల మార్కెట్లు నిర్మించినట్లు చెప్పారు.

ఆయిల్‌పాంకు ప్రోత్సాహం: జిల్లాలో 1,006 మంది రైతులకు ఆయిల్‌పామ్ సాగు కోసం రూ.353.61లక్షలు పరిపాలన అనుమతి ఇచ్చామన్నారు. పాక్‌పట్లలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం త్వరలో చేపడతామన తెలిపారు.

పోలీస్: మహిళల భద్రత కోసం జిల్లాలో షీటీమ్‌లు 112 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 170 మంది సెల్‌ఫోన్లు తిరిగి ఇప్పించామని తెలిపారు. సైబర్ నేరాల్లో రూ.16,58,710 అనుమానితుల బ్యాంక్ అకౌంట్‌లలో ఫ్రీజ్ చేయించామన్నారు.

జిల్లా ప్రజల సమష్టి సహకారంతో మరింత ప్రగతిని సాధిస్తూ రాష్ట్రంలోనే జిల్లాను అగ్రగామిగా నిలుపుతామని మంత్రి తెలిపారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయసంస్థ జిల్లా చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థుల విన్యాసం..



దేశభక్తి గేయానికి నృత్యం చేస్తున్న విద్యార్థినులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు



వేడుకల్లో నాట్యం చేస్తున్న విద్యార్థిని

మొక్కలు నాటి సంరక్షించాలి



భైంసాటౌన్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని భైంసా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి దేవేంద్రబాబు అన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, న్యాయవాదులు, సిబ్బందితో కలిసి కోర్టు ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, న్యాయవాదులు శంకర్, రఘువీర్ తదితరులున్నారు.

నేటి నుంచి పఠనోత్సవం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి, కలెక్టర్, డీఈవో

నిర్మల్ రూరల్: విద్యాశాఖ, రూమ్ టు రీడ్ సంస్థ సంయుక్తంగా యూఎస్ఏఐడీవారి ఆర్థిక సహకారంతో బుధవారం నుంచి జిల్లాలోని పాఠశాలల్లో పఠనోత్సవం నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న రీడింగ్ క్యాంపెయిన్ పోస్టర్‌ను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి , రూం టు రీడ్ స్టేట్ మేనేజర్ నర్సింహాచారి సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీరోజు ప్రార్థన సమయంలో విద్యార్థులకు చదవడం అవశ్యకతను తెలియజెప్పడం, పుస్తకాలు చదివించడం, విద్యార్థులను మంచి పాఠకులుగా మారేలా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. విద్యార్థుల్లో చదివే అలవాటు పెంచేలా బుధవారం నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ప్రతిరోజూ వివిధరకాల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మంత్రి, అధికారులు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి రాగి జావా రుచి చూశారు.

అలరించిన శకటాలు... సాంస్కృతిక కార్యక్రమాలు



వేదికపై ఉన్న మంత్రి, అధికారులకు సెల్యూట్ చేస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి



వేడుకల్లో మిషన్ భగీరథ శకటం



ప్రత్యేక ఆకర్షణగా పోలీస్ శాఖ శకటం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన 77వ స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. టీఎస్ ఆర్‌జేసీ సోఫీనగర్ విద్యార్థులు లంబాడి వేషధారణలో నృత్యం చేశారు. టీఎస్ఆర్‌డబ్ల్యూజేసి లెఫ్ట్ పోచంపాడు విద్యార్థులు దేశమంటే మట్టి కాదోయ్ అనే పాటపై, వాసవి వర్డ్ స్కూల్, విజయహై స్కూల్ విద్యార్థులు క్లాసికల్ డాన్స్ చేశారు. రవి హైస్కూల్ విద్యార్థులు దేశంలో రైతులు, దేశ సరిహద్దుల్లో సోల్జర్లు మన కోసం ఎలా శ్రమిస్తున్నారు నృత్య రూపకంగా చేసి చూపించారు. శ్రీచైతన్య, ఎస్సార్ ప్రైమ్, ఎస్ఆర్‌డిజీ, టీఎస్ఆర్‌డబ్ల్యూజే జాం, శ్రీవిద్యానికేతన్, ప్రిన్స్‌హై స్కూల్ విద్యార్థుల డ్యాన్సులు అలరించారు.

ఆకట్టుకున్న శకటాలు...

వేడుకల్లో ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. డీఆర్డీఏ శకటం, జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శకటం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను గురించి ప్రదర్శించారు. మన ఊరు మన బడి శకటం విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి గురించి వివరించారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి పొందుతున్న పథకాల గురించి వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 108, 102, ఆర్‌బీఎస్‌కే, టీహబ్, 1962 వాహనాల ద్వారా జిల్లా ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శకటం ద్వారా రైతుబంధు రైతు రుణమాఫీ వంటివి రైతులకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో ప్రదర్శన రూపకంగా చూపించారు. పోలీసు శాఖ ద్వారా అందిస్తున్న షీటీం, డాగ్ స్క్వాడ్, సైబర్ నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ తదితర సేవలను వివరించారు.

స్టాళ్ల ఏర్పాటు....

జిల్లా గ్రామీణ అభివద్ధి, మహిళా, శిశు దివ్యాంగ వయోవృద్ధుల ట్రాన్స్ జెండర్, ఉద్యాన పట్టు పరిశ్రమ, వ్యవసాయ, పురపాలక సంఘం నిర్మల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మత్స్య పశుసంవర్ధక శాఖ, జిల్లా విద్య, మిషన్ భగీరథ, ఎస్సీ కార్పొరేషన్, గిరిజన అభివృద్ధి శాఖ, పరిశ్రమలు, తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమల అభివృద్ధి సహకార సమాఖ్య, పౌరసరఫరాల శాఖ, ఓటు హక్కుపై స్టాళ్లను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పంద్రాగస్టు వేడుకలు





కలెక్టరేట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ జెండా వందనం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వ్యాప్తంగా పంద్రాగస్టు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్, క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

ఎస్పీ కార్యాలయంలో...

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో, ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు.

మంత్రి క్యాంపు కార్యాలయంలో..

శాస్త్రినగర్‌లోని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జాతీయ పతాకం ఎగురవేశారు.

జిల్లా ఆసుపత్రిలో...

జిల్లా ఆస్పత్రిలో డీసీహెచ్ఎస్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఆర్ఎంవో వేణుగోపాలకృష్ణ, వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

నిర్మల్ రూరల్: జిల్లాపరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, డీఈవో కార్యాలయంలో డీఈవో రవీందర్‌రెడ్డి జాతీయ పతాకాలు ఎగురవేశారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ గంగారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.



బాసర ఆలయ ఆవరణలో జెండా వందనం..

బాసర సరస్వతీ ఆలయంలో..

భైంసా: బాసర జ్ఞాన సరస్వతీ ఆలయ కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించారు. ఈవో విజయరామారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పూజారులు, వేదపండితులు, హోమ్‌గార్డులు, వాగ్దేవి సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదు

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. దిలావర్‌పూర్ మండలం మాయాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి శ్రీహరిరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేవలం ఎన్నికల కోసం సీఎం కేసీఆర్ స్కీమ్‌లు ప్రవేశపెట్టి, తర్వాత పక్కన పెడుతున్నారని విమర్శించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దిలావర్‌పూర్ మండలంలో ఇప్పటివరకు ఎన్ని డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనపై అన్నివర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు మేలు జరిగిందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వసుతందని ధీమా వ్యక్తంచేశారు.

మాంసం విక్రేతలకు జరిమానా



జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని పలు మాంసం విక్రయ దుకాణదారులకు మున్సిపల్ అధికారులు మంగళవారం జరిమానా విధించారు. స్వాతంత్ర దినోత్సవం రోజున నిబంధనలకు విరుద్ధంగా మాంసం దుకాణాలు తెరిచి ఉంచడంతో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్ జరిమానా వేశారు.

నిరుపేద చిన్నారులకు చేయూత



బాధితులకు బాండ్ అందిస్తున్న మంత్రి పీఏ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన నిరుపేద చిన్నారులకు మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అండగా నిలిచారు. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన మాలెపు రాజ్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో రాజ్‌కుమార్ కుమారుడు, కూతురు రణవిత్, ఆరాధ్య భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మంత్రి పీఏ ప్రత్యేక చొరవతో సీఎం ప్రత్యేక నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు. మంజూరైన రూ.2 లక్షలను చిన్నారుల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి బాండ్లను రాజ్‌కుమార్ భార్య భార్గవికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పంబాల భీమేశ్వర్, దూడ శ్రీనివాస్, ఆడెపు రవి, ఎడ్ల రాజేశ్వర్, సంద రాకేశ్, జనార్దన్, సచిన్, రమేష్, రాజ్‌కుమార్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సదర్మాట్‌కు నీటి విడుదల

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మామాట్ ఎడమ కాలువకు బుధవారం సాగునీరు విడుదల చేయనున్నట్లు ఖానాపూర్ ఇరిగేషన్ డీఈ సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు.

నిర్మల్‌కు చేరిన రాజీవ్‌జ్యోతి యాత్ర

నిర్మల్‌చైన్‌గేట్: తమిళనాడు పెరంబదూరు నుంచి తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మీదుగా ఢిల్లీకు వెళుతున్న రాజీవ్ జ్యోతి యాత్ర మంగళవారం నిర్మల్ పట్టణానికి చేరుకుంది. జిల్లా కాంగ్రెస్ నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంబడి రాజేశ్వర్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జునైద్ మెమన్, ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనందరావు పటేల్, పార్లమెంటు యూత్ కాంగ్రెస్ సెక్రటరీ అల్మాస్, మాజీ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, సోషల్ మీడియా కోఆర్డినేటర్ హర్షద్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు మతిన్, అజార్, సోహైల్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి బలవనర్మణం


వెంకటేష్ (ఫైల్)

ఖానాపూర్: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాలఏ్పడిన సంఘటన మండలంలోని మేడంపల్లి గ్రామంలో మంగళవారం వెలుగుచూసింది. ఎస్సై ఆర్.శంకర్ వివరాల ప్రకారం... బానావత్ వెంకటేష్(28) కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి ఎప్పటిలాగే తాగి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి ఇంట్లో దూలానికి లుంగీతో ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. యువకుడి తండ్రి హీరాలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. వెంకటేష్‌కు భార్య సునీత, కూతురు అక్షయ ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కుటుంబీకులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్

ప్రతిభకు పురస్కారాలు

నిర్మల్‌చైన్‌గేట్: 77వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మల్ జిల్లాలో వివిధ శాఖల్లో ప్రతిభ కనబరిచిన 278 మంది ఉద్యోగులకు రాష్ట్ర అటవీ, న్యాయ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, కలెక్టర్ వరుణ్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రతిభా పురస్కారాలు అందజేశారు.


క్రాంతికుమార్, పీఏసీఎస్, సీఈవో. | కాంతిలాల్ పటేల్ (భైంసా ఏఎస్పీ) | శంకరయ్య, ఈఈ పంచాయతీరాజ్ | శ్రీకళ, డీఎం, సివిల్‌సప్లై | అశోక్ కుమార్, ఈఈ ఆర్‌అండ్‌బీ | సివిఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ | నదీమ్, ఐటీ మేనేజర్ కలెక్టరేట్ | రామ్‌చందర్ నాయక్, తహసీల్దార్


భీంకుమార్ | శ్రీనివాస్ రూరల్ సీఐ, నిర్మల్ | రవి ఎస్సై | హనుమండ్లు, ఎస్సై, కుంటాల | జ్యోతిర్మయి, ఎస్సై | సుమలత, ఎస్సై | సాయికృష్ణ, ఆర్ ఎస్సై | రాజాగౌడ్ పిఆర్‌ఓ ఎస్పీ కార్యాలయం


అనిల్‌కుమార్ ఎస్‌బి కానిస్టేబుల్ | దావూద్ కానిస్టేబుల్ | అనితారావు ఎఫ్ఆర్‌ఓ కడెం | పూర్ణిమ ఏఎస్ ఓ నిర్మల్ | సాయిరాం ఎంపీడీవో నిర్మల్ | గంగాసాగర్ రెడ్డి ఎంపీవో | సుభాష్ మెప్మా పీడీ | మధుసూదన్ రావు


వినోద్, కంప్యూటర్ ఆపరేటర్ | అక్షయ్ క్రీడాకారుడు | సరిత సీడీపీవో, ఖానాపూర్ | రజనీదేవి, సూపర్ వైజర్, గ్రేడ్ టు | డాక్టర్ దేవేందర్ రెడ్డి, డీసీహెచ్ఎస్ | మేఘన, సివిల్ అసిస్టెంట్ సర్జన్, భైంసా | సంపత్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ | డాక్టర్ శ్యామ్ | బాలకృష్ణ, సర్వేయర్ | ప్రియాంక, ఇరిగేషన్ ఏఈ | ఉమామహేశ్వరి, ఏఈవో, లక్ష్మణచాంద | రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

ట్రిపుల్‌ఐటీలో స్వాతంత్య్ర వేడుకలు


మాట్లాడుతున్న ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ




ట్రిపుల్‌ఐటీలో నృత్య విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భైంసా: బాసరలోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లోని శాతవాహన గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ హాజరై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయుల పోరాటాలతో బ్రిటిష్ వారిని ఎదిరించి స్వాతంత్య్రం సాధించుకున్నామని తెలిపారు. బాసర ట్రిపుల్‌ఐటీ పురోగతిని సాధిస్తుందని తెలిపారు. దాదాపుగా రూ.80కోట్లు వెచ్చించామని, విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పిస్తూనే నాణ్యమైన విద్యను అందజేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి సృజనాత్మకత వైపు పయనించాలని, అందుకు ఇన్నోవేషన్ ట్రిపుల్‌ఐటీ పేరిట ఈ మధ్య కాలంలోనే ఐఐటీ హబ్ నిజామాబాద్‌లో క్యాంపస్ కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థిని లహరి విదేశంలో ఇంటర్నేషనల్ యునైటెడ్ నేషన్స్ 12వ కాన్ఫరెన్సుకు హాజరై ప్రసంగించడం ఎంతో అభినందించదగిన విషయమని కొనియాడారు. పీయూసీ-2 చదువుతున్న విద్యార్థి శ్రీపాదరెడ్డి నూతన ఆవిష్కరణలకు తావిస్తూ డ్రోన్ తయారు చేయడం, దాని ఖర్చు రూ.40వేలను విశ్వవిద్యాలయం అందించడం జరి గిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది, రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది చేసిన పెరేడ్, పిరమిడ్ విన్యాసాలు చూపరులకు కనువిందు చేశాయి. కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ సృజన, డాక్టర్ నాగసాయి, ఫైనాన్స్ అధికారి అనిల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ కో–ఆర్డినేటర్ దావులు, సీఓఈ డాక్టర్ వినోద్, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్, ప్రభాకర్, పీడీ శ్యాంబాబు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి నిరంతర కృషి

- ఐటీడీఏలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు
- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


జెండావిష్కరిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఎందరో మహనీయులు త్యాగాల ఫలితమే ఈ స్వాతంత్య్రమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పీవో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించి జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా గిరిజన ఆదివాసీలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. విద్య విభాగంలో 917 ప్రాథమిక పాఠశాలల్లో 12,214 విద్యార్థులు ఉండగా 681 ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు వివరించారు. 133 ఆశ్రమ పాఠశాలల్లో 30,478 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. మహిళా శిశు సంక్షేమ విభాగంలో ఐటీడీఏ పరిధిలోని పీవీటీజీ గ్రామాల్లో గిరి పోషణ కార్యక్రమం ప్రారంభించామని, ఇందులో భాగంగా 12,371 గర్భిణులకు, బాలింతలకు, 2–6 ఏళ్ల పిల్లలకు ఆరు రకాల పోషణ ఆహార పదార్థాలు ఇక్రిశాట్, ఐటీడీఏ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇస్తున్నామన్నారు. ఆరు నెలల నుంచి 59 నెలల తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లల ఆరోగ్యం మెరుగుపర్చడం కోసం బాలామృతం పంపిణీకి ఎస్ఎస్ఎఫ్‌పీ ప్రోగ్రాం ద్వారా పైలట్ ప్రాజెక్టుగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రారంభించినట్లు తెలిపారు. వైద్యారోగ్యం విభాగంలో అదనపు జిల్లా, ఆరోగ్య శాఖాధికారి పరిధిలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 186 ఉప ఆరోగ్య కేంద్రాలు, ఆరు సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఆరోగ్య సేవలు అందిస్తున్నాయన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో మౌలిక సదుపాయల కోసం ఐటీడీఏ జిల్లాల రోడ్ల పథకం కింద 322 తార్‌రోడ్ల నిర్మాణానికి 38,999 లక్షల అంచనాలతో మంజూరు చేసినట్లు తెలిపారు. ఎస్‌టీఎస్‌డీఎఫ్ పథకంలో రూ.45.80 కోట్ల అంచనా విలువలతో 229 గిరిజన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 కింద జిల్లాలోని 50 మండలాల్లో 499 అటవీ హక్కు కమిటీలను ఏర్పాటు చేసి మొదటి దశలో 37324 మందికి, రెండవ దశలో 37136 మందికి హక్కులు కల్పించినట్లు వివరించారు. మహిళా కమిషన్ సభ్యురాలు, ఎంపీపీ జైవంత్‌రావు, జెడ్పీటీసీ చారులత రాథోడ్, డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీ ఎంఅండ్‌హెచ్‌వో కుమ్ర బాలు, ఏఓ రాంబాబు ఉన్నారు.

బస్సు–బైక్ ఢీ, యువకుడి మృతి


బస్సును ఢీకొట్టిన బైక్


హరీశ్ మృతదేహం

నిర్మల్: ఓ వైపు పంద్రాగస్టు వేడుకలు ఘనంగా సాగుతుండగా, మరోవైపు నిండుప్రాణం రోడ్డు ప్రమాదం పాలైంది. జిల్లా కేంద్రంలోని డాక్టర్స్‌లైన్‌లో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధన్నూర్‌కు చెందిన రాజారం హరీశ్(25), అదే మండలం కుచులాపూర్, ఇచ్చోడ మండలం పిప్రిలకు చెందిన గంగయ్య, పవన్‌లు స్థానిక ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారు. ముగ్గురూ కలిసి ఒకే బైక్‌పై బస్టాండ్ వైపు బయలు దేరారు. డాక్టర్స్‌లైన్‌లోని ట్రెండ్స్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆదిలాబాద్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సును ఢీకొట్టారు. ఈ ఘటనలో హరీశ్ మృతిచెందగా, గంగయ్య, పవన్‌లకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ ఎదురుగా వెళ్తున్న పంద్రాగస్టు ర్యాలీ వెళ్తుండగా దానిని తప్పించుకుని వెళ్లేందుకు రాంగ్‌రూట్లో బస్సు రావడం, ఒకే బైక్‌పై వెళ్తున్న ముగ్గురూ స్పీడ్‌గా ఉండటం, ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు.

విదేశాల్లో దేశభక్తి చాటిన ఖానాపూర్ వాసులు


జాతీయజెండాను ప్రదర్శిస్తున్న ఖానాపూర్ వాసులు

ఖానాపూర్: ముస్లింల పవిత్రయాత్రలో భాగంగా సౌదీలోని మక్కా(ఉమ్రహ్) యాత్రకు ఖానాపూర్ వాసులు వెళ్లారు. మంగళవారం సౌదీలోని యాత్రలో పాల్గొన్న మాజీ జెడ్పీ కోఆప్షన్ డాక్టర్ చాంద్‌పాషా, ముస్లిం నాయకుడు అఫ్సర్‌ఖాన్ సౌదీ అరేబియాలోని మ క్కా ప్రాంతంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. విదేశాల్లో దేశభక్తిని చాటిన ఖానాపూర్ వాసులను పలువురు అభినందించారు.

అమ్మవారిని దర్శించుకున్న సప్తగిరి


అమ్మవారి ఆలయంలో సప్తగిరి

భైంసా: బాసర సరస్వతి అమ్మవారిని సినీ కమెడీయన్ సప్తగిరి దర్శించుకున్నారు. మంగళవారం బాసర చేరుకున్న ఆయన ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని మొక్కుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానికులు అతడితో సెల్ఫీలు తీసుకున్నారు.

జాతీయ జెండా ఎగురవేసిన గొర్రెల కాపరులు


గుట్ట వద్ద జాతీయ జెండా ఎగురవేసిన గొర్రెల కాపరులు

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి, ధర్మోర, గొడిసెరా, పంచగుడి, పిప్రి, రాజూర తదితర గ్రామాల్లోని గొర్రెల కాపరులు నిజామాబాద్ జిల్లా సారంగాపూర్ గుట్ట ప్రాంతానికి వారం రోజుల కిందట గొర్రెలను మేపేందుకు వలస వెళ్లారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌తో ఉన్న ఊరులో గొర్రెలకు మేత దొరకకపోవడంతో అక్కడికి వెళ్లారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉన్న గుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్న గుడిసె వద్ద స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం గొర్రెల కాపారులు త్రీవర్ణ పథకాన్ని ఎగురవేశారు.

మానసికస్థితి సరిగా లేక ఆత్మహత్య

కుభీర్: మండలంలోని గోడాపూర్ గ్రామానికి చెందిన యువకుడు జతాడే యోగేశ్ (22) మానసిక పరిస్థితి సరిగ్గా లేక చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఎండి షరీఫ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... యోగేశ్ ఏడాదిగా మానసిక పరిస్థితి సరిగ్గా లేక తిరుగుతున్నాడు. చాలా ఆస్పత్రులు తిరిగినా వ్యాధి నయం కాలేదు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం కుటుంబీకులు వెతికినా ఆచూకీ తెలియరాలేదు. మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని చెరువులో మృతదేహం కనిపించింది. తండ్రి సోమాజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తులతో వీరంగం

- ఇద్దరికి స్వల్ప గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో ముగ్గురు యువకులు కత్తులతో మంగళవారం వీరంగం సృష్టించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన ఓ వ్యక్తి కోలిపుర చౌరస్తాలో ఐచర్ వాహనాన్ని గత కొన్ని రోజులుగా రోడ్డుపై నిలుపుతున్నాడు. దీంతో ఆ కాలనీకి చెందిన నరేష్ అనే వ్యక్తి ఐచర్ వాహన యజమానితో రోడ్డుపై వాహనం నిలపడంతో అటువైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించడం లేదని, పిల్లలు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాహనాన్ని మరో చోట పార్కింగ్ చేయాలని సూచించాడు. దీంతో ఐచర్ యజమాని ఆయనతో దుర్భాషలాడి అక్కడినుంచి వెళ్లిపోయాడు. తన స్నేహితులు మరో ఇద్దరిని వెంటపెట్టుకొని వచ్చాడు. అందులో ఓ వ్యక్తి కత్తితో నరేష్ అతడి మిత్రుడు రవికాంత్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో వారిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఇరువర్గాలకు చెందిన వారు గుమిగూడారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు అక్కడికి చేరుకుని ఇటీవల కాలంలో హిందువులపై దాడులు పెరిగిపోతున్నాయని, కత్తితో దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాడు.

బాధితులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను సంప్రదించగా.. కత్తులతో దాడిజరిగిన సంఘటన గురించి వివరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

సారంగపూర్: మండలంలోని కొట్ల(బి) గ్రామానికి చెందిన ఎండీ బిలాల్(22) కనిపించడం లేదని తండ్రి ఎండీ మూసా ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... స్థానికంగా చికెన్ సెంటర్ నడిపే బిలాల్ సోమవారం నిర్మల్ వెళ్లి వస్తానని చెప్పి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. నిర్మల్‌లో తన స్నేహితుడికి ద్విచక్ర వాహనం అప్పగించి ఇంటికి తీసుకెళ్లాలని చెప్పి నిజామాబాద్ వెళ్తున్నట్లు చెప్పాడు. ఆతర్వాత ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.